సాక్షి వైఎస్సార్ జిల్లా

బుధవారం, 1, అక్టోబర్, 2025



సైబర్ వల.. జనం విలవిల..!

ప్రస్తుత ఆధునిక సాంకేతిక సమాజంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ) ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఏది నిజమో ఏది అబద్ధమో తెలియని పరిస్థితి. -IIలో

నేటి నుంచి రిజిస్టర్డ్ పోస్టు రద్దు

దశాబ్దాలుగా పోస్టల్ శాఖలో సేవలందిస్తున్న రిజిస్టర్డ్ పోస్ట్ రద్దవుతోంది. రిజిస్టర్డ్ పోస్టును స్పీడు పోస్టులో విలీనం చేయడం ద్వారా ఈ విధానం రద్దు కానుంది. -IIలో

గరిష్టం/కనిష్టం
33.3/24.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.4 - 33.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

3 నుంచి శిక్షణ

కడప ఎడ్యుకేషన్: మెగా డీఎస్సీ -2025లో ఎంపికైన కొత్త గురువులకు ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో ఎస్జీటీ తెలుగు, ఉర్దూ విభాగాలకు చెందిన వారికి కడప నగర శివార్లలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలోను, స్కూల్ అసిస్టెంట్లకు మదనపల్లిలో శిక్షణ ఇచ్చేలా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ శిక్షణకు అందరు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంది.

పలువురికి పదోన్నతి

కడప అగ్రికల్చర్: గ్రామ సచివాలయాల్లో పని చేసే పలువురు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లుగా(ఏఈఓలు) పదోన్నతి లభించింది. ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో పదోన్నతులకు అర్హులైన 21 మంది వీఏఏలకు ఏఈఓలుగా పదోన్నతి కల్పించామని తెలిపారు. పదోన్నతి పొందిన వారందరు రెండు, మూడు రోజుల్లో ఆఫీసులో రిపోర్టు చేసుకుంటే త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలను కేటాయిస్తామని తెలిపారు.

జిల్లాలో వర్షం



కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. ఇందులో కలసపాడులో అత్యధికంగా 23.4 మి.మీ వర్షం కురిసింది. అలాగే పోరుమామిళ్లలో 11.2, రాజుపాలెంలో 11 , దువ్వూరులో 9.8, పెద్దముడియం, చాపాడులలో 9.2 , చెన్నూరులో 7.2 , జమ్మలమడుగు, మైదుకూరులలో 6.4 , అట్లూరులో 6, సిద్దవటంలో 5.2 , బికోడూరులో 4.6 , బి.మఠంలో 4.2 , గోపవరంలో 3.8 , బద్వేల్, మైలవరంలలో 3.2 , ఖాజీపేట, కమలాపురంలలో 2.8 , ఎర్రగుంట్లలో 2.4 మి.మీ వర్షం కురిసింది.

ప్రైవేటీకరణతో దళితులకే నష్టం

- బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధ
- అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్ల రిబ్బన్లు ధరించి నిరసన



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి సుధ



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు

కడప కార్పొరేషన్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో ఎక్కువగా నష్టపోయేది దళిత, గిరిజన, బహుజన వర్గాలేనని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ అన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి, ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రైవేటీకరణకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే సుధ మీడియాతో మాట్లాడుతూ కూటమి పాలన ఎలా సాగుతుందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యం, సంక్షేమంపై అత్యంత శ్రద్ధ వహించి అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రానికి 17 కొత్త మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారన్నారు. అందులో 5 మెడికల్ కాలేజీలు పూర్తి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అందులో 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు అప్పగించడం అన్యాయమని మండిపడ్డారు. దీనివల్ల వైద్య విద్య ఖరీదుగా మారుతుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మెడికల్ సీట్లు దొరికే పరిస్థితి ఉండదన్నారు. అమరావతిలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన స్థలాన్ని కూడా ప్రైవేటుకు అప్పగించడం దారుణమని ధ్వజమెత్తారు.

- మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం వల్ల వారు వైద్య విద్యను, ప్రజా వైద్యాన్ని వ్యాపారంగా మార్చే అవకాశముందని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మన్ పులి సునీల్ కుమార్ హెచ్చరించారు.
- రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.
- ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ అయినా తెచ్చారా అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ప్రశ్నించారు. దళిత ఉద్యోగులపై జరుగుతున్న వేధింపులను ఆపాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు అన్నారు.
- వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, కె. బాబు, సుబ్బరాయుడు, ప్రసాద్, చెన్నయ్య, జాషువా, రత్నకుమారి, మరియలు, నాగేంద్ర, షేక్ షఫీ, బసవరాజు, మల్లీశ్వరి, సుజిత పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత నియమాలు పాటించాలి

కడప కార్పొరేషన్: విజయదశమి పండుగ సందర్భంగా విద్యుత్ భద్రతా నియమాలను పాటించాలని ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ సూచించారు. మంగళవారం విద్యుత్ భవన్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మండపాల వద్ద ఏర్పాటు చేసే లైటింగ్ అలంకరణలు, సౌండ్ సిస్టం, ఇతర విద్యుత్ ఉపకరణాల విషయంలో నిర్వాహకులు అత్యంత అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ, ఎత్తైన విగ్రహాల ఊరేగింపులు నిర్వహించే నిర్వాహకులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఊరేగింపు సమయాలు, మార్గాన్ని స్థానిక విద్యుత్ కార్యాలయాల్లో ముందుగానే నమోదు చేయాలన్నారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా, వెంటనే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. విజయదశమిని సురక్షితంగా జరుపుకోవాలని కోరారు.

కడప అమ్మవారిశాలలో మహిషాసురమర్దినిగా అమ్మవారు



జయజయహే... మహిషాసుర మర్దిని..

మృగత్వంపై మానవత్వం గెలుపు...! చీకటిని జయించిన వెలుగు...! ముగ్గురమ్మల శక్తి ఆదివరాశక్తి మహిషాసురుడిని ఒక్క వేటుతో తునుమాడిన రోజు దుర్గాష్టమి. దసరా ఉత్సవాల ముగింపును సూచిస్తూ వచ్చిన దుర్గాష్టమి మంగళవారం నాడు దాదాపు అన్ని అమ్మవారి ఆలయాలలోనూ మహిషాసుర మర్దిని అలంకారం చేశారు. మళ్లీ సంవత్సరంపాటు ఈ అవకాశం దక్కదని, ఈ అలంకారాన్ని చూడలేమని భావించిన భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ సమీప దారులన్నీ జనసంద్రాలయ్యాయి.

-కడప సెవెన్‌రోడ్స్/ ప్రొద్దుటూరు కల్చరల్



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో మహిషాసురమర్దిని అలంకారం



కడప వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి దర్శనానికి బారులు దీరిన భక్తులు

క్లుప్తంగా

4న తలనీలాల వేలం

సిద్దవటం : మండల పరిధి వంతాటిపల్లి గ్రామ పంచాయతీ లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో భక్తులు సమర్పించే తలనీలాల సేకరణ హక్కుకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. అక్టోబర్ 4న ఉదయం 11 గంటలకు సిద్దవటం శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలంపాట నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు లక్ష రూపాయలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు పూర్తి మొత్తం చెల్లించి రశీదు పొందాలని వివరించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ


రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశ్వ

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లి ఆర్చి వద్ద సోమవారం అర్ధరాత్రి సమయంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవగుడిపల్లి కస్పాకు చెందిన నాగరాజు కుమారుడు విశ్వ చిన్నమండెం నుంచి దేవగుడిపల్లికి వస్తుండగా కడప–బెంగళూరు జాతీయ రహదారిపై దేవుడుపల్లి ఆర్చి వద్దకు వచ్చేసరికి చిన్నమండెం మండల కేంద్రంలోని అరబిక్‌వీధికి చెందిన సాదిక్, జాఫర్, శేషావలి రాయచోటి వైపు నుంచి వస్తూ విశ్వ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన విశ్వాను తిరుపతి ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా శేషావలి, సాదిక్, జాఫర్ అతివేగంతో వచ్చి విశ్వను ఢీకొనట్టినట్లు బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మైనర్లకు బైక్‌లు ఇచ్చిన వారిపై కేసులు


తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్పీ

రాజంపేట టౌన్ : మైనర్లకు బైక్‌లు ఇచ్చేవారిపై కేసులు నమోదు చేయనున్నట్లు ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే హెచ్చరించారు. మైనర్ల డ్రైవింగ్‌పై డ్రోన్ సహాయంతో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బైక్‌లు నడిపే మైనర్లను గుర్తించి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్లే మైనర్‌లు బైక్‌లు నడుపుతున్నారన్నారు. దీని వల్ల పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదన్నారు. మైనర్లకు బైక్‌లు ఇస్తే చట్టపరంగా తల్లిదండ్రులకు శిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బి.నాగార్జున, ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో బంగారు నగలు చోరీ

ముద్దనూరు : స్థానిక పాత బస్టాండులో ఆర్టీసీ బస్సులో ఎక్కిన మహిళనుంచి నాలుగున్నర తులం బంగారు నగలు చోరీ అయ్యాయి. ఏఎస్ఐ రమేష్ సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మండలంలోని దేనేపల్లెకు చెందిన లక్ష్మీప్రసన్న అనే మహిళ తన బ్యాగులోని పర్సులో నల్లపూసల దండ, బంగారు హారం పెట్టుకుని పోట్లదుర్తి గ్రామానికి వెళ్లేందుకు తన ఇద్దరు చిన్న పిల్లలతో కలసి పాతబస్టాండులో ప్రొద్దుటూరు బస్సు ఎక్కింది. పాత బస్టాండు నుంచి 4 రోడ్ల కూడలికి వెళ్లిన తర్వాత టికెట్ కోసం పర్సులో వున్న ఆధార్‌కార్డు చూపించడానికి పర్సుకోసం చూడగా బ్యాగులో పర్సులేదని గుర్తించింది. పర్సు దొంగిలించినట్లు తెలుసుకుని వెంటనే బస్సులో నుంచి దిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

సైబర్ వల.. జనం విలవిల..!

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఉపయోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్న వైనం
- ఏమరుపాటుగా ఉంటే ఖాతాలో డబ్బులు ఖాళీ
- అప్రమత్తతే ఆయుధం అంటున్న పోలీసులు



కడప అర్బన్ : ప్రస్తుత ఆధునిక సాంకేతిక సమాజంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ) ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఏది నిజమో ఏది అబద్ధమో తెలియని పరిస్థితి. ఆన్‌లైన్‌లో ఆర్థిక నేరాలు చేసే వాళ్లు సైతం ఏఐని ఉపయోగించి సరికొత్త మోసాలకు పాల్పడుతూ కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. మోసం చేసిన వ్యక్తి ఎవరో కూడా తెలియదు. ఎక్కడ ఉంటాడో తెలియదు. ఆడ మగ కూడా గుర్తించడం వీలు కాదు. కానీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న లక్షలకు లక్షల రూపాయలను కొట్టేస్తున్నారు. నిందితులను గుర్తించడం, పట్టుకోవడం, పోగొట్టుకున్న నగదును రికవరీ చేయడం పోలీసులకు సవాలుగా మారింది.

ఆర్థికంగా చితికి పోతూ.. అవమానంగా భావిస్తూ....

తమ ఖాతాల్లో డబ్బులు పోగొట్టుకున్న తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువు పోతుందని కొందరు మానసిక వేదనతో కుంగి పోతున్నారు. కానీ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం వలన పోగొట్టుకున్న నగదు మళ్లీ బ్యాంకు ఖాతాకు తెప్పించడం పోలీసులకే సాధ్యం. సైబర్ మోసగాళ్లు విసురుతున్న సరికొత్త సవాళ్లను ఛేదిస్తూ.. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ జిల్లా పోలీసు యంత్రాంగం అండగా నిలుస్తోంది. గత మూడేళ్లలో సైబర్ క్రైమ్ ద్వారా పోగొట్టుకున్న కోట్లాది రూపాయల నగదును బ్యాంకుల్లోనే ఫ్రీజ్ చేయగలగడం జిల్లా పోలీసు యంత్రాంగానికి సాధ్యం.

అడ్డు అదుపు లేని దురాశతో...

వైఎస్సార్ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లకు ఇటీవల వస్తున్న సైబర్ మోసాల సంఘటనలు చూస్తుంటే పోలీసులే షాక్‌కు గురవుతున్నారు. అడ్డు అదుపు లేని దురాశ, అనవసరమైన వాటిని క్లిక్ చేయడం, మోసాలకు ప్రధాన కారణంగా మారుతోందని గ్రహిస్తున్నారు. వాట్సాప్, టెక్స్ట్ మెసేజ్‌లో చాలా వరకు ఏపీకే ఫైల్స్ వస్తుంటాయి. వీటిని ఏమాత్రం క్లిక్ చేసినా ఖాతాలో డబ్బులు ఖాళీ అవుతున్నాయి. కొందరు లక్కీ డిప్ బహుమతి వచ్చిందని బాధితులను ఆకర్షితులను చేసి వారిని వేధించి డబ్బులను దోచేస్తున్నారు. అనవసరమైన వాటి జోలికి వెళ్లడం సంబంధంలేని ఫైల్స్ పై క్లిక్ చేయడమే సైబర్ నేరం జరగడానికి బీజంగా మారుతుంది.

ఏపీకే ఫైల్స్ ఎవరి సెల్ ఫోన్‌కు వచ్చినా వాటిని తమ మొబైల్ డేటా ఆఫ్ చేసి కనుక్కోవచ్చు. తమ వాట్సాప్‌కు గాని టెక్స్ట్ మెసేజ్ గాని ఏపీకే ఫైల్స్ ఎవరి ద్వారానైనా వస్తే వాటిని క్లిక్ చేయకూడదు. తమ మొబైల్ డేటాను, వైఫైని మొదట ఆఫ్ చేయాలి. తరువాత వాట్సాప్ ఓపెన్ చేసి పైభాగానికి వెళ్లి ఏపీకే అని టైప్ చేయాలి. ఏ ఏ గ్రూపులో, వ్యక్తిగత కాంటాక్ట్‌ల ద్వారా వచ్చిన ఏపీకే ఫైల్స్ కనబడతాయి. అప్పుడు ఏపీకే ఫైల్స్ మీద క్లిక్ చేయకుండా, కాంటాక్ట్ పై క్లిక్ చేయాలి. తర్వాత సదరు గ్రూపులో గాని, కాంటాక్ట్‌లోకి గాని వెళ్లి వాటిని డిలీట్ చేయాలి. ఏపీకే ఫైల్స్ పూర్తిగా డిలీట్ చేసిన తర్వాత మొబైల్ డేటాని గానీ వైఫైనిగానీ ఆన్ చేసుకోవాలి. తర్వాత ఎప్పుడు ఏపీకే ఫైల్స్ వచ్చినా వాటిని ఇలాగే డిలీట్ చేస్తే మీ మొబైల్ డేటా సురక్షితంగా ఉంటుంది. పొరపాటున మొబైల్ డేటా ఆన్ లో ఉంచుకొని ఏపీకే ఫైల్స్ టచ్ చేస్తే, వెంటనే బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు ఇట్టే సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లిపోతాయి. తస్మాత్ జాగ్రత్త.

ఆన్‌లైన్ లింకులు క్లిక్ చేయరాదు..

బ్యాంకుల నుంచి వ్యక్తిగత వివరాలు ఎప్పుడూ అడగరు. అలా అడిగితే అది సైబర్ నేరగాళ్లపనే. ఆన్‌లైన్ లింకులు వస్తే వాటిని క్లిక్ చేయొద్దు. ఒకవేళ క్లిక్ చేస్తే వెంటనే మీ మొబైల్ కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఎంటర్ చేయవద్దు. ఒకవేళ చేశారంటే మీ బ్యాంకు ఖాతా వివరాలు సైబర్ నేరగాళ్లకు చేరినట్టే. ఫేస్‌బుక్‌లో కూడా అందమైన అమ్మాయిల పేరిట హనీ ట్రాప్, లింకులు పెట్టి మోసం చేస్తారు. అలా జరిగితే వెంటనే సైబర్ పోలీసులకు తెలియజేయాలి.

- సురక్షితమైన డిజిటల్ లావాదేవీలు...
- బ్యాంకు లావాదేవీలకు సంబంధించి లాగిన్ ఐడీ, పాస్ వర్డ్, ఓటీపీ, ఏటీఎం, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ వివరాలు ఎవరితోనూ పంచుకోకపోవడమే మంచిది.
- డిజిటల్ లావాదేవీలకు బార్ కోడ్ లు, క్యూ ఆర్ కోడ్‌లు, స్కానింగ్ లేదా ఎం పిన్ లేకుండా ఉన్నవే ఎంచుకోవాలి.
- ఏదైనా ఫోన్ కాల్, ఈ– మెయిల్ చేసి, మీ కేవైసీ అప్డేట్ చేయాలని వివరాలు అడిగినా చెప్పరాదు. ఒకవేళ అలాంటి అనుమానాలు ఉంటే బ్యాంకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకోవాలి. హోమ్ బ్యాంక్ శాఖను సంప్రదించాలి.
- ఈ– మెయిళ్ళు, ఎస్ఎంఎస్ లలో యుఆర్‌ఎల్, డొమైన్ పేర్లను స్పెల్లింగ్ లోపాలుంటే జాగ్రత్తగా తనిఖీ చేయాలి. ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోసం అధికారిక వెబ్‌సైట్‌లనే ఉపయోగించాలి.
- ఏదైనా వెబ్‌సైట్, అప్లికేషన్లలో మీ ఈ–మెయిల్ ను యూజర్ ఐడీగా నమోదు చేస్తున్నప్పుడు మీ ఈ–మెయిల్ పాస్‌వర్డ్ ను పాస్‌వర్డ్ అని పెట్టుకోవద్దు.

సైబర్ నేరాలకు సంబంధించి కొంతమంది బాధితుల ఉదాహరణలు ఇలా..

- డిజిటల్ అరెస్ట్ పేరుతో పులివెందులకు చెందిన రిటైర్డ్ టీచర్ రూ.1.50 కోట్లు, ప్రొద్దుటూరుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ. 3.50 కోట్లు, కడపకు చెందిన రిటైర్డ్ డాక్టర్ నుంచి రూ. 65 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. మొదట వీడియోకాల్స్, వాట్సాప్ కాల్స్ ద్వారా సీబీఐ, ఈడీ, పోలీసుల పేర్లతో బెదిరించి వివరాలను సేకరించి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులను కాజేస్తారు.
- పెట్టుబడుల పేరుతో డబ్బులను రూ.10వేలు పెట్టించి వెంటనే రూ.15వేలు జమచేస్తారు. ట్రేడింగ్ పేరుతో కడపకు చెందిన వ్యక్తి రూ.1.50 కోట్లు, ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి రూ.1.50 కోట్లు, పులివెందులకు చెందిన రిటైర్డ్ టీచర్ రూ. 65 లక్షలు పోగొట్టుకున్నారు.
- హనీట్రాప్ పేరుతో ఒంటరిగా జీవిస్తున్న వారు, ప్రత్యేకంగా యువకులు మోసపోతున్నారు. బద్వేల్‌కు చెందిన వ్యక్తి రూ. 6.50 లక్షలు, జమ్మలమడుగుకు చెందిన వ్యక్తి రూ. 70 లక్షలు, ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి రూ.2.50 లక్షలు పోగొట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 30 మంది బాధితులు హనీట్రాప్‌కు గురైనవారు వుంటారు.
- వర్క్‌ఫ్రం హోమ్, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి నుంచి ప్రాసెస్ ఫీజుల పేరుతో రూ.2500, రూ.3500 వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ఇలాంటి బాధితులున్నారు.

సోషల్ మీడియా పేరుతో అసత్యప్రచారం చేసేవారిపై ఫిర్యాదులను 9121100686 కుగానీ, సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారు 1930కు గానీ, సైబర్ నేరానికి గురైన తరువాత గంటలోపు ఫిర్యాదు చేస్తే మంచిది. కడపలో సైబర్ నేరాలను నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పర్యవేక్షణలో పోలీసు అధికారుల సూచనల మేరకు ఇన్స్‌పెక్టర్ మధుమల్లేశ్వర్‌రెడ్డి, సిబ్బంది కృషి చేస్తున్నారు.

వైఎస్ఆర్ కడప జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు నమోదైన సైబర్ నేరాలు, సోషల్ మీడియా కేసుల వివరాలు

సంవత్సరం	సైబర్ నేరాలు	సోషల్ మీడియా నేరాలు
2019	21	41
2020	34	10
2021	36	21
2022	52	31
2023	46	25
2024	31	28
2025 (ఇప్పటివరకు)	12	26
ఏడేళ్లలో నమోదైన కేసులు	232	182
మొత్తం కేసులు		414

ఈ కేసులలో మొత్తం 141 మందిని సైబర్ నేరాల కేసుల్లోనూ, 71 మందిని సోషల్ మీడియా కేసుల్లో అరెస్ట్ చేశారు. జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు ప్రజలు రూ. 40 కోట్ల మేరకు పోగొట్టుకున్నారు. పోలీసుల కృషితో రూ. 2 కోట్ల మేరకు బ్యాంక్ ఖాతాలలోని డబ్బులను ఫ్రీజ్ చేయగలిగారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



స్మార్ట్ ఫోన్‌లను వాడుతున్న ప్రతి ఒక్కరూ ఆధునిక సాంకేతికను సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలి. సైబర్ నేరాల బారిన పడకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. అలాగే సోషల్ మీడియాలో అసభ్యకర దూషణలు, వ్యక్తిగతంగా ఇబ్బందులను కలిగించే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు.

– జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడపలో పోలీసు స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ


కడప టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ సుబ్బారావుకు సూచనలు ఇస్తున్న ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప అర్బన్ : కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్, కమాండ్ కంట్రోల్ సెంటర్, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లను మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని దేవాలయాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తామన్నారు. పోలీస్ అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. అంతకుముందు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడుతూ నగరంలోని సి.సి. కెమెరాల పనితీరు, ఎల్.హెచ్.ఎం.ఎస్ కెమెరాలు, డయల్ 112 గురించి అడిగి తెలుసుకున్నారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ సమయంలో పెండింగ్ కేసులు త్వరితగతిన విచారించి పరిష్కరించాలని సీఐ జి.సుబ్బారావును ఆదేశించారు. మిస్సింగ్ కేసులను వేగవంతంగా ఛేదించాలన్నారు. సైబర్ నేరాలను సైబర్ క్రైమ్ విభాగం వారితో సమన్వయం చేసుకుని ఛేదించాలని సూచించారు. వన్ టౌన్ ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ఎస్.ఐ. సిద్దయ్య, ఎస్.ఐ ఎస్.కె.ఎం హుస్సేన్, కమాండ్ కంట్రోల్ హెడ్ కానిస్టేబుల్ టి.రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బిరెడ్డి ఆత్మహత్యకు బాధ్యులను అరెస్టు చేయాలి


ఎస్పీ కార్యాలయం వెలుపల మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

కడప అగ్రికల్చర్ : బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లె గ్రామానికి చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్టు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్‌చేశారు. ఆగస్టు 4వ తేదీ ఆత్మహత్యకు యత్నించగా అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 8వ తేదీ మృతి చెందాడన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ మంగళవారం జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సత్తార్, సీపీఐ(ఎంఎల్) నాయకుడు బిండెల ఓబయ్య, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప, అఖిలపక్ష నాయకులు నారాయణ, సీఆర్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సుబ్బిరెడ్డి, లెక్కల రమణారెడ్డికి మధ్య గత కొన్ని సంవత్సరాలుగా భూమి తగాదా ఉందన్నారు. ఈ విషయమై బి.మఠం పోలీసు స్టేషన్‌కు వెళ్లి వచ్చిన తర్వాత భూమిరెడ్డి సుబ్బిరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. పోలీసు స్టేషన్‌లో తనకు అవమానం జరిగిందని కుటుంబ సభ్యులతో మృతుడు చెప్పాడన్నారు. అంతేకాక కొన్ని నెలల క్రితం జరిగిన సుబ్బిరెడ్డి కుమారుడు నాగిరెడ్డి మృతిపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. లెక్కల రమణారెడ్డి, శ్యామల, మరికొందరు వేధింపులకు పాల్పడినట్లు ఆరోపించారు. సుబ్బిరెడ్డి కుటుంబానికి న్యాయం జరగకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిశంకర్‌రెడ్డి, దేవర కృష్ణ, మధు, దాదాపీర్, శ్రీనివాసులు, అంజి, ప్రశాంత్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


అంజలి (ఫైల్)

కలసపాడు : మండలంలోని దిగువ తంబళ్లపల్లె గ్రామానికి చెందిన ఈస అంజలి (26) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ తిమోతి మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దిగువ తంబళ్లపల్లె గ్రామానికి చెందిన అంజలి ఈ నెల 22వ తేదీన పోరుమామిళ్లలో ఓ హోటల్‌లో పనిచేసేందుకు వెళ్లి ఇంత వరకు రాలేదు. బంధువుల ఇంటికి వెళ్లిందేమోనని విచారించగా అక్కడ కూడా లేదని మంగళవారం ఆమె భర్త శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121100632 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చాపాడు : మండలంలోని ద్వారకానగరం వద్ద గల కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని దర్గా బాబా సాహెబ్ (45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దువ్వూరు మండలం చింతకుంటకు చెందిన బాబా సాహెబ్ సోమవారం రాత్రి బైక్‌పై మైదుకూరుకు వచ్చి పని చూసుకుని తిరిగి వెళుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చాపాడు పోలీసులు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె రూరల్ : పట్టణంలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. స్థానిక బుగ్గకాలువలో పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో బుగ్గకాలువకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్‌లు, రూ.17,950 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

- అక్టోబర్ 10వ తేదీ తుది గడువు
- ఆలస్యమైతే అపరాధ రుసుం తప్పదు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి తొలి అడుగు పడింది. వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు విడుదల చేసింది. అక్టోబర్ 10వ తేదీ పరీక్ష ఫీజు చెల్లింపునకు తుది గడువుగా నిర్ణయించారు. 2026 మార్చిలో జరగనున్న పరీక్షలకు సంబంధించి ఈనెల 15వ తేదీ నుంచి ఫీజు చెల్లింపునకు బోర్డు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అక్టోబర్ 10వ తేదీ వరకు గడువు విధించారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రూ. 1000 అపరాధ రుసుంతో చెల్లించే అవకాశం కల్పించారు. గడువులోపు పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులు అప్రమత్తం కావాలని ఇంటర్‌బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

పరీక్ష ఫీజుల చెల్లింపు వివరాలు ఇలా...

ఇంటర్ ఫస్టియర్, సెకెండియర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులు థియరీ పరీక్షల నిమిత్తం రూ. 600 చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ కోర్సులు చదివే సెకండియర్ సైన్సు విద్యార్థులు ప్రాక్టికల్ కోసం రూ. 275 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సు చదువుతూ బ్రిడ్జి కోర్సు చేసే విద్యార్థులు బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు పరీక్ష రుసుంగా రూ. 165 చెల్లించాల్సి ఉంటుంది. సెకెండియర్ చదువుతూ ఫస్టియర్ సబ్జెక్టులు ఫెయిల్ అయిన విద్యార్థులుంటే మొదటి , రెండవ సంవత్సరం థియరీ పరీక్ష ఫీజు కలిపి రూ. 1200 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సు చదువుతూ ఫస్టియర్, సెకెండియర్ ప్రాక్టికల్ రాసే విద్యార్థులు రెండేళ్లకు కలిపి రూ. 550 చెల్లించాల్సి ఉంటుంది. బ్రిడ్జి కోర్సు చదివే విద్యార్థులు రెండేళ్ల పరీక్ష ఫీజు కింద రూ. 330 చెల్లించాలని తెలిపారు.

నేటి నుంచి రిజిస్టర్డ్ పోస్టు రద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దశాబ్దాలుగా పోస్టల్ శాఖలో సేవలందిస్తున్న రిజిస్టర్డ్ పోస్ట్ రద్దవుతోంది. రిజిస్టర్డ్ పోస్టును స్పీడు పోస్టులో విలీనం చేయడం ద్వారా ఈ విధానం రద్దు కానుంది. కొత్త విధానం అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా పోస్టల్ శాఖ అమలులోకి తీసుకురానుంది. ఇకనుంచి స్పీడ్ పోస్ట్ పార్సిల్ సేవలు అందనున్నాయి. స్పీడ్ పోస్ట్ అనేది పోస్టల్ శాఖలో విస్తృత సేవలు అందిస్తోంది. కొత్తగా స్పీడ్ పోస్ట్‌లో ట్రాకింగ్ సిస్టం కూడా అందుబాటులోకి వచ్చింది. పార్సెల్ బుక్ చేసిన వ్యక్తికే కాకుండా దానిని అందుకోనున్న వ్యక్తి మొబైల్ ఫోన్‌కు పూర్తి సమాచారంతో కూడిన మెసేజ్ వస్తుంది. బుక్ పార్సిల్ ఎక్కడుంది. ఎప్పటికి అందుతుంది వంటి వివరాలు మొబైల్ ఫోన్‌లో చూసుకునే వెసులుబాటు కల్పించింది.

సరికొత్త టెక్నాలజీ దిశగా....

పోస్టల్ శాఖలో ఇప్పటివరకు అమలవుతున్న టెక్నాలజీ విధానాలకు స్వస్తి పలికి సరికొత్త సాంకేతిక ఆధునికతతో కూడిన ఏపీటీ 2.0 ద్వారా సేవలందిస్తోంది. జులై నెలకు ముందు పోస్టల్ శాఖ మొత్తం సేవలు కోర్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్, కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారా అందేవి. వీటినే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఉన్న ఏపీటీ 2.0 అమలులోకి తెచ్చింది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి విలీనమైన స్పీడ్ పోస్ట్ ద్వారా సాంకేతిక సౌకర్యాలతో సేవలందించేందుకు కడప పోస్టల్ డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు.

జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్ ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

కడప రూరల్ : ఇటీవల మరణించిన, ప్రమాదాలు, అనారోగ్యాల బారిన పడిన జర్నలిస్టుల కుటుంబాలకు కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్ తరపున మంగళవారం ఆర్థికసాయం అందించారు. అనారోగ్యంతో మృతి చెందిన ఇమామ్ అనే జర్నలిస్టు కుటుంబానికి ప్రెస్‌క్లబ్ తరపున ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి, ప్రెస్‌క్లబ్ కన్వీనర్ లక్ష్మీనాథరెడ్డి రూ. 20 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే ప్రమాదాలు, అనారోగ్యానికి గురైన సుధీర్, సుధీర్, శ్రీనివాసులు, చాంద్‌బాషాలకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున అందజేశారు. ఇలా మొత్తం రూ. 60 వేలు సాయం అందించారు. అనారోగ్యంతో ఉన్న జర్నలిస్టులకు అండగా నిలిచేందుకు కడప ప్రెస్‌క్లబ్ గత మూడేళ్లుగా పది వేల రూపాయలు తక్షణ సాయం కింద అందజేస్తోందని, మరణించిన వారి కుటుంబాలకు రూ. 20 వేలు ఇస్తున్నామని కన్వీనర్ లక్ష్మీనాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రమేష్, మురళి, కిశోర్, కెమెరామెన్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డీటీసీ కావలెను!

- 9 నెలలుగా రవాణాశాఖ కార్యాలయంలో సీటు ఖాళీ
- ఇన్‌చార్జి డీటీసీలతో సరిపెడుతున్న అధికారులు
- సకాలంలో పనులు కాక వాహనదారులు సతమతం


జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో 9 నెలల నుంచి డీటీసీ సీటు ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ ఉన్న డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి లైంగిక ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయనను ప్రభుత్వం సస్పెండ్‌చేసి విచారణకు ఆదేశించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు డీటీసీ సీటు ఖాళీగానే ఉంది.

ఇన్‌చార్జి డీటీసీలతో విధులు..

రవాణాశాఖ అధికారులు ఇతర జిల్లాల అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించి వారితో విధులు నిర్వహింపజేస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు డీటీసీలు ఇక్కడ ఇన్‌చార్జిలుగా పని చేశారు. అన్నమయ్య జిల్లా డీటీసీ ప్రసాద్‌ను ఇన్‌చార్జిగా నియమించగా ఆయన నాలుగు నెలలు పని చేసి వెళ్లారు. తర్వాత చిత్తూరు డీటీసీ నిరంజన్ రెడ్డి మూడు నెలలు, అనంతరం ప్రస్తుతం అనంతపురం డీటీసీ వీర్రాజు ఇన్‌చార్జి డీటీసీగా వాహనదారులకు సేవలను అందిస్తున్నారు. ఆయన వారంలో బుధవారం, గురువారం మాత్రమే ఇక్కడ ఉంటూ కార్యకలాపాలను నడిపిస్తున్నారు. ఈ రెండు రోజులు మినహా మిగతా రోజుల్లో డీటీసీ లేకపోవడంతో వాహనదారులకు సకాలంలో సరైన సేవలు అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవాణాశాఖ కార్యాలయంలో అధికారుల కొరత ఉండటంతో ఉన్న సిబ్బందిపైనే భారం పడుతోంది. ఇతర ఏ శాఖలో అయినా అధికారి బదిలీ అయినా సస్పెండ్ అయినా వెంటనే వేరే అధికారిని నియమించే ప్రభుత్వం జిల్లా ఉప రవాణాశాఖ కార్యాలయానికి మాత్రం ఇంతవరకు రెగ్యులర్ డీటీసీని నియమించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం



పీలేరురూరల్ : చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని కాకులారంపల్లె పంచాయతీలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కాకులారంపల్లె పంచాయతీ చింతకొమ్మచెరువులో గుర్తు తెలియని యువకుడి మృతదేహం తేలాడుతూ ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ఎవరైంది ఎలాంటి ఆధారాలు లేవని సీఐ యుగంధర్ తెలిపారు. మృతుని కుడి చేతిపై అమ్మ అని, మణికట్టుపై ఎస్‌బీఆర్ అనే అక్షరాలతో పచ్చబొట్టు ఉందని చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440796944, 9440796745 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.




రన్నరప్ బోపన్న-యుజికి జోడీ

కెరీర్‌లో 27వ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. టోక్యోలో మంగళవారం ముగిసిన జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-టకెరు యుజికి (జపాన్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. హ్యూగో నిస్ (మొనాకో)-ఎడువార్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటతో జరిగిన డబుల్స్ ఫైనల్లో బోపన్న-యుజికి ద్వయం 5-7, 5-7తో పోరాడి ఓడిపోయింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-యుజికి ఆరు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌లను ఒకసారి బ్రేక్ చేశారు. రన్నరప్ బోపన్న-యుజికి జంటకు 72,940 డాలర్ల (రూ. 64 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 300 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. విజేతగా నిలిచిన హ్యూగో నిస్-వాసెలిన్ ఖాతాలో 1,36,760 డాలర్ల (రూ. 1 కోటీ 21 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు చేరాయి. 45 ఏళ్ల బోపన్న తన డబుల్స్ కెరీర్‌లో 64 టోర్నీల్లో ఫైనల్‌కు చేరాడు. 26 టోర్నీల్లో విజేతగా, 38 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

ప్రదానం చేయలేదని.. ఎప్పటికీ పంపరా?

ఏసీసీ చీఫ్ నఖ్వీ ట్రోఫీ డ్రామాపై బీసీసీఐ ఆక్షేపణ ● ఏజీఎంలో తీవ్రస్థాయిలో అభ్యంతరం



రాజీవ్ శుక్లా



నఖ్వీ

దుబాయ్: ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) అధ్యక్షుడి వ్యవహార శైలిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మండిపడింది. మంగళవారం ఇక్కడ ఏసీసీ సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరిగింది. ఇందులో భారత బోర్డు తరఫున సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, మాజీ కోశాధికారి ఆశిష్ షెలార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధ్యక్షుడు కూడా అయిన ఏసీసీ చీఫ్ మోసిన్ నఖ్వీ విపరీత ధోరణిపై బీసీసీఐ ప్రతినిధులిద్దరు ఆక్షేపించారు. నఖ్వీ పాక్ ప్రభుత్వంలో మంత్రి కూడా కావడంతో టీమిండియా అతని చేతుల మీదుగా జరగాల్సిన ట్రోఫీ ప్రదానోత్సవాన్ని సున్నితంగా తిరస్కరించింది. ఆదివారం రాత్రి తను ప్రదానం చేయలేదన్న అక్కసుతో నఖ్వీ తర్వాత కూడా విజేత భారత జట్టుకు పంపకుండా ఏసీసీ కార్యాలయంలోనే అట్టిపెట్టాడు. దీంతో 'కప్' లేకుండానే భారత క్రికెట్ జట్టు సభ్యులు స్వదేశానికి వచ్చారు. మంగళవారం జరిగిన ఏజీఎంలో నఖ్వీ కొనసాగిస్తున్న 'ట్రోఫీ డ్రామా'పై శుక్లా, షెలార్ తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది ఏసీసీ ట్రోఫీ. ఒక వ్యక్తికి సంబంధించినది కాదు. వ్యక్తిగతంగా ఎవరికి చెందదు. టోర్నీలో గెలిచిన విజేత జట్టుకే అప్పగించాలి' అని రాజీవ్ శుక్లా గట్టిగానే స్పష్టం చేశారని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. ఏజీఎంలో ఇంత జరుగుతున్నా... భారత్ నుంచి తీవ్రస్థాయిలో అభ్యంతరం వెల్లువెత్తుతున్నా... ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ మాత్రం ఇంకా తన మొండి పట్టు వీడటం లేదు. ట్రోఫీని ఇచ్చేందుకు సమావేశంలో అంగీకరించలేదని తెలిసింది. ట్రోఫీ గురించి ఏజీఎంలో చర్చించాల్సిన అవసరం లేదని, మరో సమావేశంలో మాట్లాడుకుందామని నఖ్వీ దాటవేశారు. ఏసీసీ ఎజెండాలోని వైస్ చైర్మన్ ఎన్నిక వరకే ఈ మీటింగ్‌ను పరిమితం చేయాలని చూశారు. అంతేకాదు. వెస్టిండీస్‌పై నేపాల్ సంచలన విజయం పట్ల నేపాల్ జట్టును అభినందించారు. నేపాల్ ఆసియా జట్టు కావొచ్చు. కానీ ఆ ద్వైపాక్షిక సిరీస్ ఏసీసీకి సంబంధించిన టోర్నీ కానేకాదు. అయినా నేపాల్‌ను ప్రశంసించిన నఖ్వీ... ఏసీసీ సొంత టోర్నీ అయిన ఆసియా కప్ గెలిచిన భారత్‌ను మాటమాత్రంగానైనా అభినందించకుండా తన కుటిల బుద్ధిని చాటుకున్నారు. మొత్తానికి ఆసియా కప్ ట్రోఫీ మాత్రం ఇంకా ఏసీసీ కార్యాలయంలోనే ఉంది.

దీప్తి ఆల్‌రౌండ్ షో

భారత మహిళల శుభారంభం

- శ్రీలంకపై 59 పరుగులతో జయభేరి
- రాణించిన హర్లీన్, అమన్‌జోత్
- ఈనెల 5న పాకిస్తాన్‌తో టీమిండియా పోరు
- మహిళల వన్డే ప్రపంచకప్

గువాహటి: సొంతగడ్డపై అట్టహాసంగా ఆరంభమైన వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. బ్యాటింగ్‌లో అర్ధసెంచరీ సాధించిన దీప్తి శర్మ బౌలింగ్‌లో కీలక వికెట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచింది. దీంతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 59 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్... వర్షం వల్ల కుదించిన 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (53 బంతుల్లో 53; 3 ఫోర్లు), అమన్‌జోత్ కౌర్ (56 బంతుల్లో 57; 5 ఫోర్లు, 1 సిక్స్), రాణించారు. లంక బౌలర్లలో ఇనొక రణవీర 4 వికెట్లు, ప్రబోధని 2 వికెట్లు తీశారు. అనంతరం దిగిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (47 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుగ్గా ఆడింది. దీప్తి (3/54) సహా భారత బౌలర్లు స్నేహ్ రాణా (2/32), ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీచరణి (2/37), క్రాంతి (1/41), అమన్‌జోత్ (1/37), ప్రతిక (1/6) సమష్టిగా ప్రత్యర్థి బ్యాటర్ల భరతం పట్టారు.



అమన్‌జోత్‌తో నడిపించి... బౌలింగ్‌తో గెలిపించి...

భారత వెటరన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోకు శ్రీలంక కుదేలైంది. ప్రతీక (37; 3 ఫోర్లు, 1 సిక్స్), **హర్లీన్ డియోల్ (64 బంతుల్లో 48; 6 ఫోర్లు) మెరుగ్గా ఆడినప్పటికీ మరోవైపు కీలక స్టార్లు స్మృతి మంధాన (8), హర్మన్‌ప్రీత్ (21), జెమీమా (0), రిచా ఘోష్ (2) విఫలమవడంతో 124/6 స్కోరు** వద్ద భారత్ పనైపోయిందనిపించింది. ఈ దశలో దీప్తి, అమన్‌జోత్‌తో కలిసి భారత్‌ను నడిపించింది. లంక అమ్మాయిల చెత్త ఫీల్డింగ్‌తో అమన్‌జోత్ మూడుసార్లు 18, 37, 50 పరుగుల వ్యక్తిగత స్కోర్ల వద్ద అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడింది. ఇద్దరు అర్ధసెంచరీ పూర్తి చేసుకొని జట్టును ఒడ్డుకు చేర్చారు. ఏడో వికెట్‌కు 99 బంతుల్లో 103 పరుగులు జోడించాక ముందుగా అమన్‌జోత్, అనంతరం దీప్తి అవుటయ్యారు. ఆఖర్లో స్నేహ్ రాణా (15 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించింది. తర్వాత కష్టమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయి ఓటమిని ఆహ్వానించింది. ఓపెనర్, కెప్టెన్ చమరి ఆటపట్టు, వన్‌డౌన్ బ్యాటర్ హర్షిత (29; 3 ఫోర్లు), మిడిలార్డర్‌లో నీలాక్షిక సిల్వా (29 బంతుల్లో 35; 4 ఫోర్లు; 1 సిక్స్) మెరుగ్గా ఆడారంతే! మిగతా బ్యాటర్లను భారత బౌలింగ్ దళం క్రీజులో నిలువనీయలేదు.

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X న్యూజిలాండ్
వేదిక: ఇండోర్
మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతిక రావల్ (సి) విష్మి (బి) ఇనొక 37; స్మృతి మంధాన (సి) విష్మి (బి) ప్రబోధని 8; హర్లీన్ డియోల్ (సి) దిల్హారి (బి) ఇనొక 48; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) సంజీవని (బి) ఇనొక 21; జెమీమా రోడ్రిగ్స్ (బి) ఇనొక 0; దీప్తి శర్మ (సి) సుగంధిక (బి) అచిని 53; రిచా ఘోష్ (సి) ప్రబోధని (బి) చమరి 2; అమన్‌జోత్ (సి) విష్మి (బి) ప్రబోధని 57; స్నేహ్ రాణా (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (47 ఓవర్లలో 8 వికెట్లకు) 269. వికెట్ల పతనం: 1-14, 2-81, 3-120, 4-120, 5-121, 6-124, 7-227, 8-269.

బౌలింగ్: అచిని కులసూర్య 8-0-42-1, ఉదేషిక ప్రబోధని 10-1-55-2, సుగంధిక 9-0-46-0, కవిశా దిల్హారి 8-0-51-0, ఇనొక రణవీర 9-0-46-4, చమరి 3-0-24-1.

శ్రీలంక మహిళల ఇన్నింగ్స్: హాసిని (బి) క్రాంతి గౌడ్ 14; చమరి (బి) దీప్తి శర్మ 43; హర్షిత (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రీచరణి 29; విష్మి గుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) అమన్‌జోత్ 11; కవిశా (సి) రిచా ఘోష్ (బి) దీప్తి 15; నీలాక్షిక (బి) స్నేహ్ రాణా 35; అనుష్క (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 6; సుగంధిక (బి) స్నేహ్ రాణా 10; అచిని (సి) స్మృతి (బి) శ్రీచరణి 17; ప్రబోధని (నాటౌట్) 14; ఇనొక రణవీర (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రతిక రావల్ 3; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం** (45.4 ఓవర్లలో ఆలౌట్) 211. వికెట్ల పతనం: 1-30, 2-82, 3-103, 4-105, 5-130, 6-140, 7-173, 8-184, 9-199, 10-211.

బౌలింగ్: క్రాంతి గౌడ్ 9-0-41-1, అమన్‌జోత్ 6-0-37-1, స్నేహ్ రాణా 10-0-32-2, దీప్తి శర్మ 10-1-54-3, శ్రీచరణి 8-0-37-2, ప్రతిక 2.4-0-6-1.

జాతీయ క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, శిక్షకులు, సంస్థలను గౌరవించేందుకు ఉద్దేశించిన జాతీయ క్రీడా పురస్కారాలు-2025 కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏటా ఇచ్చే ఈ అవార్డుల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు అక్టోబర్ 28వ తేదీ. క్రీడారంగంలో వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన వారికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు, అర్జున అవార్డు, అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం), ద్రోణాచార్య అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ (ఆర్‌కేపీపీ) పురస్కారాలను అందజేస్తారు. క్రీడాకారులు, కోచ్‌లు, సంస్థలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ప్రత్యేక పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. అవార్డుల మార్గదర్శకాలు, ఇతర వివరాల కోసం మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ www.dbtyas-sports.gov.in ను చూడాలని కోరింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

తిలక్ వర్మకు సీఎం అభినందన



సాక్షి, హైదరాబాద్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాద్ యువ క్రికెటర్ తిలక్ వర్మను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో తిలక్ వర్మ మర్యాదపూర్వకంగా కలిశాడు. పాకిస్తాన్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో తిలక్ వర్మ అజేయ అర్ధ సెంచరీ సాధించి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ సందర్భంగా తిలక్ వర్మ సీఎం రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్‌ను, జెర్సీని అందజేశాడు. తిలక్ ఇచ్చిన బ్యాట్‌తో రేవంత్ రెడ్డి క్రికెట్ షాట్ కొడుతున్న పోజు పెట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనారెడ్డి, 'శాట్స్' ఎండీ సోనీ బాలాదేవి, సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాస్ రాజు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశలు వమ్ము చేయకూడదని...

శేరిలింగంపల్లి: పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో ఎంతో ఒత్తిడి ఉన్నా... ప్రత్యర్థి ఆటగాళ్లు ఎంత రెచ్చగొట్టినా... ఎక్కడా సంయమనం కోల్పోలేదని... వారికి తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చానని తిలక్ వర్మ వ్యాఖ్యానించాడు. చిన్ననాటి నుంచి తాను ప్రాక్టీస్ చేసిన శేరిలింగంపల్లిలోని లేగలా క్రికెట్ అకాడమీకి మంగళవారం తిలక్ వచ్చాడు. ఈ సందర్భంగా తన కోచ్ సలామ్ బాయష్, అకాడమీ ఎండీ పృథ్వీ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. 'కోట్లాది మంది భారతీయుల ఆశలను వమ్ము చేయకూడదనుకున్నాను. చివర్లో ఒత్తిడి వచ్చినా... దేశం కోసం ఆడాలి, గెలిపించాలన్న లక్ష్యంతో ఓపికగా ఆడాను. హెడ్ కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎంతో ప్రోత్సహించారు. నేనీ స్థాయికి చేరుకోవడం వెనుక కోచ్ సలామ్, పృథ్వీ పాత్ర ఎంతో ఉంది. ఈ ఇద్దరినీ ఎప్పటికి మర్చిపోలేను. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలి. ఈ విషయంలో కోహ్లి, రోహిత్ శర్మలు ఆదర్శం' అని తిలక్ తెలిపాడు.

సాక్షి సినిమా



సమంత

జ్ఞాపకాలను మోయడం ఆపేశాను

''నా ఇరవయ్యేళ్ల వయసులో విశ్రాంతి లేకుండా గందరగోళంలో గడిపాను... గుర్తింపు కోసం ఆరాటపడ్డాను. నా ఫీలింగ్స్ ఏవీ పైకి కనిపించకుండా ఉండేందుకు కష్టపడ్డాను. ఈ క్రమంలో నన్ను నేను ఎంత కోల్పోయానో నాకు మాత్రమే తెలుసు. ఆ సమయంలో ప్రేమ గురించి నాకెవరూ చెప్పలేదు. కానీ నిజమైన ప్రేమ మనలోనే దాగి ఉంటుందని, మనల్ని మనం ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఆ తర్వాత అర్థం చేసుకున్నాను'' అని పేర్కొన్నారు సమంత. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన ఆలోచనలను, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్‌తో షేర్ చేసుకుంటుంటారు సమంత. తన మేకప్‌మేన్‌తో ఓ సుదీర్ఘమైన చర్చ జరిగిందని, ఈ చర్చలో ఎన్నో అంశాలను మాట్లాడుకున్నామని పేర్కొని, వాటిలోని కొన్ని అంశాలను ప్రస్తావిస్తూ, ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేశారు సమంత. ''ముప్పైఏళ్ల తర్వాత మీరు ప్రపంచాన్ని చూసే తీరు మారిపోతుంది. మీ అందంలో మార్పులొస్తాయి. ఇప్పుడు నేను ముప్పై ఏళ్లలో ఉన్నాను. ప్రతి దాని వెంట పరుగులు పెట్టడం ఆపేసి, జీవితాన్ని ఆస్వాదిస్తున్నాను. గతంలో నేను చేసిన తప్పుల తాలూకు జ్ఞాపకాలను మోయడం ఆపేశా. పబ్లిక్‌లో ఒకలా... ఒంటరిగా ఉన్నప్పుడు మరోలా... ఇలా రెండు రకాలుగా ఉండటం మానేశాను. ఎందుకంటే మీరు మీలా ఉన్నప్పుడే హ్యాపీగా... స్వేచ్ఛగా జీవించగలరు'' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు సమంత.


కెమెరా కాలింగ్

మలయాళ స్టార్ మమ్ముట్టి కొంత గ్యాప్ తర్వాత తిరిగి సినిమా సెట్స్‌లోకి అడుగు పెడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో మమ్ముట్టి తీవ్ర అస్వస్థతకు గురయ్యారనే వార్తలు తెరపైకి వచ్చాయి. కానీ మమ్ముట్టి ఆరోగ్య సమస్య స్వల్పమైనదేనని, ప్రస్తుతం ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని దర్శకుడు మహేశ్ నారాయణన్ పేర్కొన్నారు. మమ్ముట్టి, మోహన్‌లాల్ ప్రధాన పాత్రధారులుగా ఫాహద్ ఫాజిల్, కుంచాకో బోబన్ కీలక పాత్రల్లో నటిస్తున్న మలయాళ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో మమ్ముట్టి అస్వస్థతకు గురయ్యారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ''జీవితంలో నాకు ఎంతో ఇష్టమైన పనిని (సినిమా షూటింగ్‌ని ఉద్దేశించి) తిరిగి ప్రారంభిస్తున్నాను. నా ఆబ్సెన్స్‌లో నా గురించి తెలుసుకోవాలనుకున్న అందరికీ థ్యాంక్స్ చెప్పడానికి మాటలు సరిపోవు. ది కెమెరా ఈజ్ కాలింగ్'' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు మమ్ముట్టి. అలాగే ఈ విషయంపై మహేశ్ నారాయణన్ మాట్లాడుతూ- ''మమ్ముట్టిగారు తిరిగి సినిమా సెట్స్‌లోకి వస్తున్నందుకు థ్రిల్లింగ్‌గా ఉంది. రాబోయే షూటింగ్ షెడ్యూల్‌లో మమ్ముట్టి, మోహన్‌లాల్ కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. ఇన్ని రోజులు మమ్ముట్టిగారు సెట్స్‌కు రాకపోవడం వల్ల నష్టం వాటిల్లకుండా ఆయన లేని సీన్స్ చిత్రీకరించాం'' అని పేర్కొన్నారు.



మమ్ముట్టి

నవంబరులో కొదమసింహం



చిరంజీవి

చిరంజీవి కెరీర్‌లోని సూపర్ హిట్ చిత్రాల్లో 'కొదమసింహం' ఒకటి. కె. మురళీ మోహనరావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాధ, సోనమ్, వాణీ విశ్వనాథ్ హీరోయిన్లుగా, మోహన్‌బాబు విలన్ పాత్ర పోషించారు. కె. నాగేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం 1990 ఆగస్టు 9న విడుదలై, ఘన విజయాన్ని సాధించింది. ముప్పైఐదేళ్ల తర్వాత ఈ సినిమాని నవంబరు 21న రీ రిలీజ్ చేయనున్నట్లు రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వరరావు తెలిపారు. ''చిరంజీవి కౌబాయ్‌గా నటించి, ప్రేక్షకుల్ని అలరించిన చిత్రం 'కొదమసింహం'. రాజ్-కోటి సంగీతం, మోహన్‌బాబు వినోదం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రాన్ని 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా నవంబరు 21న రీ రిలీజ్ చేయబోతున్నాం'' అని కైకాల నాగేశ్వర రావు చెప్పారు.

అసురుల గురువు శుక్రాచార్యుడు



అక్షయ్ ఖన్నా

'**హ**నుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందుతోన్న తాజా చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందిన తొలి చిత్రం 'హనుమాన్' (2024) పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ యూనివర్స్‌లో రూపొందుతోన్న ద్వితీయ చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ క్రియేటర్, షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అసురుల గురువు శుక్రాచార్యుడి పాత్రను బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పోషిస్తున్నారు. ఈ క్యారెక్టర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఛావా' వంటి సూపర్ హిట్ మూవీలో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించి, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు అక్షయ్ ఖన్నా. తెలుగులో ఆయనకి 'మహాకాళి' తొలి చిత్రం. దేవతలు-దానవులు... ఇద్దరి భవితవ్యాన్ని మలిచిన శుక్రాచార్యుడిగా అద్భుతమైన పాత్ర పోషిస్తున్నారు అక్షయ్. 'మహాకాళి' షూటింగ్ 50 శాతం పూర్తయింది. డిసెంబరుకి మొత్తం పూర్తవుతుంది. ఇతర నటీనటులు, సినిమా విడుదల తేదీ వివరాలను త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.



దీపికా పదుకోన్

యాక్షన్... థ్రిల్



విష్ణు విశాల్

విష్ణు విశాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ఆర్యన్'. సెల్వ రాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రలు పోషించారు. ప్రవీణ్ .కె దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్ స్టూడియోస్‌పై శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని మంగళవారం రిలీజ్ చేశారు. ''ఒక యునిక్ ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఆర్యన్'. 'రాట్ససన్' వంటి విజయవంతమైన సినిమా తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీసాఫీసర్ పాత్ర పోషించారు. మా మూవీ ప్రేక్షకులను డార్క్ అండ్ ఇంటెన్స్ వరల్డ్‌లోకి తీసుకెళుతుంది. తనదైన శైలిలో విభిన్నమైన పాత్రతో విష్ణు విశాల్ ఆకట్టుకుంటారు'' అని యూనిట్ పేర్కొంది. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకి కెమెరా: హరీష్ కన్నన్, సంగీతం: జిబ్రాన్.

ఏడడుగులు వేసిన చిన్నారి పెళ్లికూతురు



మిలింద్ చాంద్వానీ, అవికా గోర్

'**చి**న్నారి పెళ్లికూతురు' సీరియల్ ఫేమ్ అవికా గోర్ ఇప్పుడు నిజ జీవితంలో పెళ్లి పీటలెక్కారు. సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త మిలింద్ చాంద్వానీతో ఆమె ఏడడుగులు వేశారు. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ద్వారా గుర్తింపు సొంతం చేసుకున్న అవికా గోర్ ఆ తర్వాత హీరోయిన్‌గా మారారు. తెలుగుతో పాటు కన్నడ, హిందీలో పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటించారు. గత ఆరేళ్లుగా ప్రేమలో ఉన్న మిలింద్, అవికా గోర్ జూన్‌లో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రేమికులు మంగళవారం వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

పరాక్... వింటేజ్ స్టైల్!



శ్రీ మురళి

శ్రీ మురళి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పరాక్'. హలేష్ కోగుండి దర్శకత్వంలో బ్రాండ్ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. బెంగళూరులోని బండి మహాకాళి ఆలయంలో మంగళవారం ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ వేడుకకు చన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవరాజు ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ మురళి మాట్లాడుతూ- ''పరాక్' ఒక వింటేజ్ స్టైల్ సినిమా'' అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: చరణ్‌రాజ్, కెమెరా: సందీప్ వల్లూరి.

వివాదాలు సృష్టించవద్దు! - ఫరా ఖాన్



ఫరా ఖాన్

దర్శకురాలు ఫరా ఖాన్, హీరోయిన్ దీపికా పదుకోన్‌ల మధ్య అభిప్రాయభేదాలొచ్చాయని, అందుకే ఇన్‌స్టాలో వీరిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నారన్నది బాలీవుడ్ టాక్. దీపిక కెరీర్‌లోని రెండు బ్లాక్‌బస్టర్ చిత్రాలు 'ఓం శాంతి ఓం' (2007), 'హ్యాపీ న్యూ ఇయర్' (2014)లో షారుక్ ఖాన్ హీరోగా నటించగా, ఫరా ఖాన్ దర్శకత్వం వహించారు. ఇలా దీపిక-ఫరాల మధ్య మంచి అనుబంధం ఉంది. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా సినిమాల్లో హీరోయిన్స్ 8 గంటలే పని చేయాలన్నట్లుగా, 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' కాన్సెప్ట్ గురించి దీపిక మాట్లాడారు. ఈ కాన్సెప్ట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ఓ షోలో పాల్గొన్న ఫరా ఈ 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' గురించి కాస్త వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో దీపికను ఉద్దేశించే ఫరా ఖాన్ అలా మాట్లాడారని, అందుకే వీరిద్దరూ ఒకరినొకరు ఇన్‌స్టాలో అన్‌ఫాలో అయ్యారని ప్రచారమవుతోంది. ఈ ప్రచారంపై ఫరా స్పందించారు. ''హ్యాపీ న్యూ ఇయర్' సినిమా షూటింగ్ సమయంలోనే నేను, దీపిక ఇన్‌స్టాలో కాకుండా డైరెక్ట్ మెసేజ్ లేదా ఫోన్ కాల్స్ ద్వారా మాట్లాడాలనుకున్నాం. అప్పుడే మేం ఒకరినొకరం అన్‌ఫాలో అయ్యాం. కొన్ని వెబ్ పోర్టల్స్ కొత్త వివాదాలు సృష్టిస్తున్నారు'' అంటూ తన ఇన్‌స్టా స్టోరీలో ఫరా షేర్ చేశారు. ఈ స్టోరీకి ఓ నమస్కారం ఎమోజీతో దీపిక స్పందించారు.

పల్లెటూరి నేపథ్యంలో...



స్వప్న, రామసత్యనారాయణ

తిలక్ రాజ్, తుంగ జంటగా నటించిన చిత్రం 'తాళికట్టు శుభవేళ'. వి. జగన్నాథ రావ్ దర్శకత్వంలో బి. అరుణ్ కౌశిక్ నిర్మించిన ఈ సినిమాలో దేవరాజ్ ముఖ్యపాత్ర పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, తుమ్మలపల్లి ఆంజనేయులు గుప్త, తల్లాడ సాయికృష్ణ, స్వప్న చౌదరి హాజరై, 'తాళికట్టు శుభవేళ' వీడియో సాంగ్స్, ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం రామసత్యనారాయణ మాట్లాడుతూ- ''కొత్త తరానికి విలువలు నేర్పే మంచి కుటుంబ కథగా ఈ చిత్రం నిలిచిపోతుందని నమ్ముతున్నాను'' అని చెప్పారు. ''పల్లెటూరి నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. గ్రామీణ శైలిని ప్రతిబింబించే కథతో, వినోదం, భావోద్వేగాన్ని కలగలిపి రూపొందించాం'' అన్నారు వి. జగన్నాథ రావ్.